క్లుప్తంగా

18న బహిరంగ వేలం

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక ఆర్టీసీ పార్శిల్ కార్యాలయంలో వినియోగదారులు తీసుకు వెళ్లని వస్తువులకు 18న బహిరంగ వేలం నిర్వహిస్తామని అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ (కమర్షియల్) మాధవ్ బుధవారం ప్రకటించారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు స్థానిక బస్ స్టేషన్‌లోని పార్శిల్ ఆఫీస్ వద్ద వేలం ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న పాటదారులు పాల్గొనవచ్చని అన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

కడియం: దుళ్ల హైస్కూల్‌లో కొయ్యల రాంబాబు స్మారక క్రికెట్ టోర్నీ బుధవారం ప్రారంభమైంది. రాంబాబు ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ టోర్నీని దివంగత రాంబాబు సోదరుడు వీరబాబు ప్రారంభించారు. ఇందులో మొత్తం 17 జట్లు పోటీ పడుతున్నాయి. సర్పంచ్ కొండపల్లి పట్టియ్య, ఉప సర్పంచ్ తోకల శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు కట్టుంగ నాగరాజు, పుత్సల బసవశంకరం, మాజీ సర్పంచులు దూడల నాగేశ్వరరావు, గుర్రపు కొండయ్య మాస్టారు, ఎస్‌ఎంసీ చైర్మన్ నూలు సోమేష్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

శ్రీరాముని అక్షతల దర్శనం పూర్వజన్మ సుకృతం



అక్షతలతో ఆలయ ప్రదక్షిణ చేస్తున్న శ్రీనివాస్

సీటీఆర్ఐ: అయోధ్య శ్రీరామ మందిరం నుంచి వచ్చిన అక్షతలను దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతమని ఉమా మార్కండేయ స్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి రాగోలు శ్రీనివాస్ అన్నారు. బుధవారం స్థానిక గోదావరి గట్టున ఉమామార్కండేయ స్వామివారి ఆలయానికి వచ్చిన అక్షతలను శిరస్సుపై పెట్టుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామివారి వద్ద ఉంచారు. ఈ అక్షతలను మకర సంక్రాంతి సందర్భంగా ఈ నెల 15న సాయంత్రం 6 గంటలకు భక్తులకు పంపిణీ చేస్తామన్నారు.

కోడిపందేలు నిర్వహిస్తే చర్యలు

రాజమహేంద్రవరం రూరల్: సంక్రాంతి పండగ రోజుల్లో కోడి పందేలు, గుండాటలు, పేకాట, మూడు ముక్కలాట, స్కిల్ కాయిన్స్ ఆడటం, మద్యం అక్రమ విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఈబీ నార్త్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పండుగ రోజుల్లో జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ పిట్టా సోమశేఖర్ ఆదేశాల మేరకు రైడ్స్ టీమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. వీరు ఆయా గ్రామాల్లో పర్యటించి కేసులు నమోదు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటారన్నారు.

విజయనగరం వెళ్లి.. పింఛను ఇచ్చి



విజయనగరంలో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ జ్యోతి

ధవళేశ్వరం: అనారోగ్యంతో బాధపడుతున్న సరగపు వరలక్ష్మికి వృద్ధాప్య పింఛన్ ఇచ్చేందుకు ధవళేశ్వరం సచివాలయం-4 పరిధిలోని వలంటీర్ దూబాసి జ్యోతి విజయనగరం వెళ్లారు. వరలక్ష్మి ఇటీవల చిన్న కుమారుడు ఇంటికి విజయనగరం వెళ్లారు. అనారోగ్యంతో పింఛన్ తీసుకునేందుకు రాలేని పరిస్థితిలో అక్కడే ఉండిపోవాల్సి వచ్చింది. ఈ విషయం తెలుసుకున్న వలంటీర్ జ్యోతి సుమారు 250 కిలోమీటర్లు ప్రయాణించి విజయనగరం వెళ్లి పింఛన్ అందజేశారు. జ్యోతి సేవాభావాన్ని పలువురు అభినందించారు.

పథకాలపై ప్రచారం

రాజమహేంద్రవరం సిటీ: ప్రధాని మోదీ సారథ్యంలో రాష్ట్రానికి సంక్షేమ పథకాలు వస్తున్నాయని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు అన్నారు. బుధవారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటైన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై క్షేత్రస్థాయిలో ప్రచారం చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. నాయకులు రేలంగి శ్రీదేవి, బొమ్మల దత్తు తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రకాశంనగర్: స్థానిక హోటల్ రివర్ బేలో 18వ రాష్ట్ర రైతు మహాసభలు మూడో రోజు బుధవారం కొనసాగాయి. ఈ సందర్భంగా రైతు సంఘ రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా పి.రామచంద్రయ్య, అధ్యక్షుడిగా జి.ఈశ్వరయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎ.కాటమయ్య, ఉపాధ్యక్షులుగా ఎ.రామానాయుడు, వి.హనుమారెడ్డి , ఎం.యల్లమందరావు, ప్రధాన కార్యదర్శిగా కేవీవీ ప్రసాద్, కార్యవర్గ సభ్యులుగా డేగా ప్రభాకర్, కె.జగన్నాథం, వి.జమలయ్య, సి.మల్లికార్జున, బుడితి అప్పలనాయుడు, కార్యదర్శి, కోశాధికారిగా వలవలపూడి రాముతో కూడిన 21 మంది కార్యవర్గం, 58 మంది సభ్యులతో నూతన కమిటీ ఏర్పాటైంది. అనంతరం జరిగిన సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. భూ యాజమాన్య హక్కుల చట్టం 2023ను రద్దు చేయాలని, కౌలు రైతుల చట్టాన్ని సవరించి గుర్తింపు కార్డులు ఇవ్వాలని, భూగర్భ జలాల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని తీర్మానించారు.

మార్గం సుగమం



అందంగా ముస్తాబైన హుకుంపేట జాతీయ రహదారి నుంచి బాలాజీపేట రోడ్డు





కల్వర్టు నిర్మించే ప్రాంతం

- జాతీయ రహదారి– తూర్పు రైల్వేస్టేషన్ రోడ్డు పూర్తి
- వాహన చోదకులకు తీరిన కష్టాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

రాజమహేంద్రవరం రూరల్: అద్దంలా మెరిసిపోతూ.. సర్వాంగ సుందరంగా రోడ్లు ముస్తాబవుతున్నాయి.. వైఎస్సార్ ప్రభుత్వం రహదారుల ప్రగతికి అధిక ప్రాధాన్యం ఇస్తోంది. దీంతో రహదారుల ప్రగతికి మార్గం సుగమమైంది.. గత టీడీపీ ప్రభుత్వం చేసిన తప్పిదాలతో రాజమహేంద్రవరం రూరల్ హుకుంపేట జాతీయ రహదారి నుంచి బాలాజీపేట తూర్పు రైల్వే స్టేషన్‌కు వెళ్లే రోడ్డు అత్యంత అధ్వానంగా తయారైంది. ఇటుగా ప్రయాణమంటేనే ప్రజలు నరకయాతన పడ్డారు. అనేక మంది ప్రమాదాలు కొనితెచ్చుకున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ గత ప్రభుత్వంలో రోడ్డు వేసిన కాంట్రాక్టర్ మెయింటెనెన్స్ వ్యవధి ఉండడంతో కేవలం మరమ్మతులు చేస్తూ రావాల్సి వచ్చేది. ఇటీవల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సదరు ఆర్‌అండ్‌బీ రోడ్డుకు రూ.కోటి నిధులను మంజూరు చేశారు. దీంతో పాటు త్వరితగతిన నిర్మాణం పూర్తి చేయడంతో సర్వత్రా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గత గోదావరి పుష్కరాల సమయంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం హుకుంపేట జాతీయ రహదారి నుంచి బాలాజీపేట తూర్పు రైల్వేస్టేషన్ రోడ్డును నిర్మించింది. దీనిని నాణ్యతా ప్రమాణాలు పూర్తి స్థాయిలో పాటించకుండా నిర్మించడంతో వేసిన కొద్ది రోజులకే గుంతలు పడ్డాయి. దుమ్ము రేగి అధ్వానంగా మారింది. అటుగా ప్రయాణమంటేనే జనం అమ్మో అనేవారు. అనంతరం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కొత్తగా రోడ్డు నిర్మాణం చేపట్టాలంటే గతంలో రోడ్డు నిర్మించిన కాంట్రాక్టర్ మెయింటెనెన్స్ కాలం ఉండడంతో గోతులు పడినప్పుడల్లా మరమ్మతులు చేపడుతూ వస్తున్నారు. ఈ రోడ్డు మరింత గుంతలమయంగా మారడం, వాహనచోదకులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, ఎంపీ మార్గాని భరత్‌రామ్‌లు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్లడంతో ఇటీవల ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మాణానికి రూ.కోటి నిధులను మంజూరు చేశారు. రోడ్డు నిర్మాణాన్ని పూర్తి నాణ్యతతో శరవేగంగా పూర్తి చేశారు. ఇలా ఆ ప్రాంతంలో వాహనచోదకులు, ప్రజలు కష్టాలు తీరాయి. ఇటుగా నిత్యం అనేక మంది రైల్వే స్టేషన్, తాడితోట తదితర ప్రాంతాలకు వెళ్తుంటారు. రోడ్డు సర్వాంగ సుందరంగా ముస్తాబు కావడంతో వారంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రూ.45 లక్షలతో కల్వర్టు పనులు

ఈ రోడ్డులో ఆవ కాలువపై కల్వర్టు నిర్మాణానికి సైతం రాష్ట్ర ప్రభుత్వం రూ.45 లక్షల నిధులను మంజూరు చేసింది. ఈ పనులకు కూడా త్వరలోనే జిల్లా ఇన్‌చార్జి మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ఆధ్వర్యంలో శంకుస్థాపన చేయనున్నారు. దీనికి గాను అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. కల్వర్టు నిర్మాణం జరిగితే ఈ ప్రాంత ప్రజలకు ఎటువంటి సమస్యలు ఉండవని సామాజిక కార్యకర్త ధర్మారెడ్డి అన్నారు.

సీఎం జగన్‌తో ప్రతి గడపకూ సంక్షేమం

- వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం ఖాయం
- జేసీఎస్ ఇన్‌చార్జి తాటికొండ విష్ణుమూర్తి



హుకుంపేటలో మా నమ్మకం నువ్వే జగనన్న బుక్‌లెట్‌ను విడుదల చేస్తున్న విష్ణుమూర్తి



వెంకాయమ్మపేటలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రాజమహేంద్రవరం రూరల్: సంక్షేమాన్ని ప్రతి గడపకూ తీసుకొచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని మండల జేసీఎస్ ఇన్‌చార్జి తాటికొండ విష్ణుమూర్తి అన్నారు. బుధవారం హుకుంపేట సచివాలయం-1లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని ఆయన పార్టీ సచివాలయ కన్వీనర్లతో కలిసి ప్రారంభించారు. విష్ణుమూర్తి, సచివాలయ కన్వీనర్లు డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా ప్రజలకు అందించిన సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. అనంతరం మా నమ్మకం నువ్వే జగనన్న బుక్‌లెట్‌ను విడుదల చేశారు. హుకుంపేట గ్రామ కూడలిలో పార్టీ శ్రేణులతో కలిసి పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా తాటికొండ విష్ణుమూర్తి మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబానికి పథకాలు నేరుగా అందిస్తూ సీఎం జగన్ ఆదర్శ పాలన సాగిస్తున్నారన్నారు. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణను సీఎం జగన్ రూరల్ కోఆర్డినేటర్‌గా నియమించారని, ప్రజలంతా ఆయనకు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరారు. సచివాలయం-1 కన్వీనర్లు పసలపూడి శ్రీనివాస్, పేరూరి శేషాద్రి, పార్టీ మండల కార్యదర్శి కుప్పాల రాంబాబు, మండల చేనేత విభాగం అధ్యక్షుడు ఈర్లు నాగబాబు, మండల ఎస్సీ విభాగం అధ్యక్షుడు సుందరపల్లి అనిల్, మండల పంచాయతీ రాజ్ విభాగం జనరల్ సెక్రటరీ బీదం రాజు, మండల కార్యవర్గ సభ్యుడు బండి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పేదల బాగు కోసమే పథకాలు

కడియం: రాష్ట్రంలో పేదల బాగు కోసం సీఎం జగన్ అనేక పథకాలు అమలు చేస్తున్నారని మండల జేసీఎస్ కన్వీనర్ తాడాల విష్ణుచక్రవర్తి అన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని కడియపులంక పంచాయతీ పరిధి వెంకాయమ్మపేటలో నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల బోర్డును, పార్టీ జెండాను ఆవిష్కరించారు. కడియపులంక సచివాలయం-4లో ఇప్పటి వరకూ రూ.24.23 కోట్లు వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం, సొసైటీ త్రీమెన్ కమిటీ చైర్మన్ తిరుమలశెట్టి శ్రీను, పార్టీ నాయకులు అయితరెడ్డి వెంకటస్వామి, దాసరి శ్రీనివాస్, రంబాల దుర్గారావు, గండి రమణ, తిరుకోటి నాగేశ్వరరావు, కూసి సూర్యనారాయణ, బోడపాటి మూర్తి, కె.శేఖర్, చీకట్ల మాచరయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీషిర్డీసాయిలో సంక్రాంతి సంబరాలు



శ్రీషిర్డీసాయి స్కూల్‌లో సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న అతిథులు, విద్యార్థులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): శ్రీషిర్డీ సాయి విద్యాసంస్థల ఆధ్వర్యంలో స్థానిక ఆల్ బ్యాంక్ కాలనీలోని స్కూల్ ఆవరణలో బుధవారం సంక్రాంతి సంబరాలు జరిగాయి. ఈ సందర్భంగా విద్యాసంస్థల డైరెక్టర్ టి.శ్రీవిద్య మాట్లాడుతూ స్కూల్ ప్రాంగణం పల్లె వాతావరణాన్ని తలపించే విధంగా అలంకరించారని, విద్యార్థులు డూడూ బసవన్న, హరిదాసు, కొమ్మదాసరి, చెంచులక్ష్మి, సోదెమ్మల వేషధారణలతో అలరించారన్నారు. అంతరించి పోతున్న సంస్కృతీ సంప్రదాయాలను విద్యార్థులకు తెలియజేయాలనే ఉద్దేశంతో ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్య అతిథిగా ప్రముఖ సాహితీవేత్త, శతావధాని డాక్టర్ పేరయ్యనాయుడు హాజరై మాట్లాడుతూ పల్లెల్లో కనుమరుగవుతున్న భోగి పండ్లు, కొమ్మదాసరి వంటి వాటిని కళ్లకు కట్టినట్లు చూపించారన్నారు. మరో ముఖ్యఅతిథి, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత రేఖ మాట్లాడుతూ విద్యార్థులు ప్రదర్శించిన ప్రతి కార్యక్రమం ఎంతో హృద్యంగా సాగిందన్నారు. ప్రిన్సిపాల్ ప్రసాదరెడ్డి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'ఫ్యూచర్ కిడ్స్ గ్లోబల్'లో పండగ శోభ



ఫ్యూచర్ కిడ్స్ స్కూల్‌లో ఏఎస్పీ చెంచిరెడ్డిని సత్కరిస్తున్న డైరెక్టర్ రవిబాబు

రాజమహేంద్రవరం రూరల్: పిల్లల పెంపకంలో తల్లిదండ్రులు ఏమాత్రం అశ్రద్ధ వహించరాదని, ముఖ్యంగా సెల్ ఫోన్లకు దూరంగా ఉంచాలని అడిషనల్ ఎస్పీ ఎల్.చెంచిరెడ్డి సూచించారు. కవలగొయ్యి ఫ్యూచర్ కిడ్స్ గ్లోబల్ స్కూల్ ఆవరణలో 'సారంగ్ సంక్రాంతి ఉత్సవ సంబరాలు' బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏఎస్పీ చెంచిరెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలతో స్నేహంగా మెలుగుతూ వారి ఇష్టాఇష్టాలను తెలుసుకుని ప్రోత్సహించాలన్నారు. స్నేహితులతో ఎక్కువ సేపు గడపడం కాకుండా చదువుపై శ్రద్ధ వహించి, లక్ష్యాలను సాధించేలా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. రంగవల్లులతో గొబ్బెమ్మలు పెట్టి సంబరాలు జరిపారు. ముందుగా మహాగణపతి నృత్యంతో మొదలైన కార్యక్రమం వివిధ రకాలైన నృత్య రూపకాలు, జానపద, శాస్త్రీయ, భువన విజయం రూపకం, ఆధునిక నృత్యాలతో చిన్నారులంతా సందడి చేశారు. పాఠశాల డైరెక్టర్ రవిబాబు యేలేటి, చైర్‌పర్సన్ విజయ యేలేటి, డీన్ హర్షిణి, ప్రిన్సిపాల్ ఎం.శేషగిరిధర్, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముందే వచ్చిన సంక్రాంతి



భోగి మంట వద్ద కోలాటం ఆడుతున్న ధవళేశ్వరం డ్రీమ్స్ స్కూల్ విద్యార్థినులు

ధవళేశ్వరం: భోగి మంటలు, రంగవల్లులు, గోదాదేవి, హరిదాసుల వేషధారణలు, బొమ్మల కొలువు, గంగిరెద్దుల హడావుడితో ధవళేశ్వరం డ్రీమ్స్ స్కూల్‌లో సంక్రాంతి శోభ నెలకొంది. సంక్రాంతి ముందే వచ్చిందా అనే విధంగా విద్యార్థులు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. బొమ్మల కొలువును అందంగా తీర్చిదిద్దారు. హరిదాసు, సంప్రదాయ వేషధారణలతో విద్యార్థులు అలరించారు. రంగవల్లులను అందంగా తీర్చిదిద్ది గొబ్బెమ్మలను పెట్టారు. భోగి మంటలు వేసి దాని చుట్టూ కోలాటం ఆడారు. ఆడుతూ, పాడుతూ పల్లెల్లో జరిగే పండగ వాతావరణాన్ని ప్రతిబింబించారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు భోగి పండ్లు పోశారు. మన సంస్కృతీ సంప్రదాయాలను తెలియజేసేందుకు సంక్రాంతి వేడుకలు నిర్వహించినట్లు స్కూల్ కరస్పాండెంట్ ఎ.రమేష్ పేర్కొన్నారు. ప్రిన్సిపాల్స్ ఎస్.సంధ్యాకుమారి, జి.విమలారోజీ, ఎన్.దీపిక, వేమగిరి డ్రీమ్స్ ఫస్ట్ ప్రీ స్కూల్ ప్రిన్సిపాల్ కె.లలితాదేవి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'ఆడుదాం-ఆంధ్రా' పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు సతీష్‌చంద్ర స్టాలిన్



వాలీబాల్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

కడియం: జేగురుపాడులో 'ఆడుదాం-ఆంధ్రా' మండల స్థాయి వాలీబాల్ పోటీలను బుధవారం ప్రారంభించారు. ఇందులో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇక్కడి జీవీకే హైస్కూల్ గ్రౌండ్స్‌లో ఏర్పాటైన పోటీలను వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్ చంద్ర స్టాలిన్ ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని అంతా క్రీడా స్ఫూర్తితో సాగాలని పిలుపునిచ్చారు. మహిళలు, పురుషుల విభాగంలో మొత్తం 54 జట్లు పాల్గొంటున్నాయని మండల క్రీడాధికారి డేవిడ్ తెలిపారు. ప్రిలిమినరీ రౌండ్స్ బుధవారం పూర్తి కాగా, సెమీ, క్వార్టర్ ఫైనల్స్ గురువారం జరుగుతాయని వివరించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు), ఎంపీడీఓ కె.రత్నకుమారి, తహసీల్దార్ ఎం.సుజాత, ఎంపీటీసీ సభ్యుడు ఆకుల సుధాకర్, ఫిషర్‌మెన్ సొసైటీ అధ్యక్షులు శాకా కిరణ్, పంచాయతీ కార్యదర్శి శిరీష తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి చాటేలా సంబరాలు

- ఎంపీ మార్గాని భరత్‌రామ్
- ఆయా డివిజన్లలో రంగవల్లుల పోటీలు



రంగవల్లుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: తెలుగువారి సంస్కృతి చాటేలా సంక్రాంతి పండగ జరుపుకోవాలని ఎంపీ మార్గాని భరత్‌రామ్ ఆకాంక్షించారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా బుధవారం స్థానిక 3, 4, 5, 6, 7, 8, 9, 21, 24, 37, 38, 39, 46 డివిజన్లలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మహిళలకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ఆయా చోట్ల ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించిన విజేతలను ఎంపీ భరత్ ప్రకటించారు. వీరికి ప్రథమ బహుమతిగా ఫ్రిజ్, ద్వితీయ బహుమతిగా టీవీ, తృతీయ బహుమతిగా వాషింగ్ మెషీన్‌ను ఈ నెల 12న స్థానిక ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించే సంక్రాంతి సంబరాల్లో అందజేస్తామని ఎంపీ తెలిపారు. కాగా విజేతలకు ప్రత్యేక బహుమతులను ఆయన అందజేశారు. ఎంపీ మాట్లాడుతూ నగరంలోని 42 డివిజన్లలో ఈ పోటీలను నాలుగు రోజులుగా ఆయా డివిజన్ ఇన్‌చార్జులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు నిర్వహిస్తున్నారన్నారు. ప్రతి డివిజన్ నుంచి విజేతలను ఎంపిక చేసి బహుమతులు శుక్రవారం అందజేస్తామన్నారు. ఆ రోజు పతంగులు ఎగురవేయడం, కోడి పందేలు, గంగిరెద్దులు, హరిదాసులు, ఇలా సంక్రాంతి తెలుగు వైభవం ఉట్టిపడేలా సంబరాలు నిర్వహిస్తామన్నారు. నగరంలోని ప్రజలంతా కుటుంబ సభ్యులతో సహా పాల్గొనాలని ఎంపీ కోరారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, గుర్రం గౌతమ్, పోలు విజయలక్ష్మి, పిల్లి నిర్మల, ఏవీ రమణ, అరిగేలా బాబు, లంక ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి వేణుకు వినతి



మంత్రి వేణును కలసి పుష్పగుచ్ఛం అందిస్తున్న నర్సరీ అసోసియేషన్ పాలకవర్గ సభ్యులు

కడియం: సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లు పోలరాజు ఆధ్వర్యంలో పాలకవర్గ సభ్యులు బుధవారం మంత్రి, రూరల్ కోఆర్డినేటర్ చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణను రాజమహేంద్రవరంలో కలసి వినతిపత్రం అందజేశారు. విద్యుత్ మీటర్లు, పాలీ హౌస్ రాయితీ బకాయిల విడుదల తదితర అంశాలను ఆయన దృష్టికి తీసుకు వెళ్లినట్లు పోలరాజు తెలిపారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, రైతులు ఉన్నారు. అంతకు ముందు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

రేపు సంక్రాంతి సంబరాలు



సంక్రాంతి సంబరాలకు ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

రాజమహేంద్రవరం సిటీ: సంక్రాంతి ఉత్సవాలను పురస్కరించుకుని స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఈ నెల 12న ఎంపీ భరత్‌రామ్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నారు. బుధవారం ఈ ఏర్పాట్లను వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు, మున్సిపల్ అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు మజ్జి అప్పారావు, నగేష్, ఏడీసీ అదనపు కమిషనర్ సత్యవేణి, ఎంహెచ్ఓ వినూత్న, మెప్మా మిషన్ మేనేజర్ రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన



సీసీ రోడ్డు ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: గ్రామాల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పన ద్వారా గ్రామీణ ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. అనపర్తి గ్రామ పంచాయతీ నిధులు రూ.46 లక్షల వ్యయంతో అభివృద్ధి చేసిన సీసీ రహదారిని ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో వ్యాపారవేత్త సబ్బెళ్ల అమ్మిరెడ్డి, సబ్బెళ్ల జనార్ధనరెడ్డి, చిట్టి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, ఉపసర్పంచ్ చిర్ల వీర్రాఘవరెడ్డి, ఎంపీటీసీలు కొండేటి భీమేష్, సుకాసుల శివ, సర్పంచ్ సత్యంశెట్టి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సారా బట్టీలపై దాడులు

రాజమహేంద్రవరం రూరల్: రాయుడుపాకలు గ్రామంలో ఎస్ఈబీ నార్త్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ ఆధ్వర్యంలో ఎస్సై, సిబ్బంది బుధవారం విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా జుత్తుక చంద్రశేఖర్‌ను అరెస్టు చేసి 35 లీటర్ల సారా, రెండు అల్యూమినియం పాత్రలను స్వాధీనం చేసుకున్నారు. 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

ఎల్ఐసీ ఉద్యోగుల నిరసన



ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సిబ్బంది

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయం వద్ద ఉద్యోగులు బుధవారం భోజన విరామానికి ముందు గంట పాటు సమ్మెకు దిగారు. జాయింట్ ఫ్రంట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. వేతన సవరణ చర్చలు ప్రారంభించాలని, నూతన పింఛను పథకంలో ఉద్యోగులకు యాజమాన్య వాటాను 14 శాతానికి పెంచాలనే తదితర అంశాల్లో యాజమాన్య ఏకపక్ష వైఖరిని ఖండిస్తూ నిరసన తెలిపారు. అన్ని తరగతుల ఉద్యోగ సంఘాల నాయకులు మాట్లాడుతూ యాజమాన్యం స్పందించకుంటే నిరసన ఉధృతం చేస్తామన్నారు. ఉద్యోగుల సంఘ నాయకులు గుబ్బల రాంబాబు, ఎం.కోదండరామ్, పి.సతీష్ , డెవలమెంట్ ఆఫీసర్స్ నాయకులు కె.అశోక్, క్లాస్-1 అధికారుల సంఘ నాయకులు ప్రసాద్, ఉద్యోగ సంఘాల నాయకులు ఈశ్వరరావు, సత్యదేవ, మాథ్యూస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వీఆర్ఏ మృతి



ప్రసాద్ (ఫైల్)

రాజానగరం: మండలంలోని నందరాడకు సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గోకవరం తహసీల్దార్ కార్యాలయంలో పని చేస్తున్న గ్రామ రెవెన్యూ సహాయకుడు (వీఆర్ఏ) కొల్లాటి ప్రసాద్ (40) మృతి చెందాడు. రాజానగరంలో నివాసం ఉంటున్న ఆయన కార్యాలయంలో విధులు ముగించుకుని బైకుపై రాజానగరం వస్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో దుర్మరణం పాలయ్యాడు. తలకు హెల్మెట్ ఉన్నా అతనిని కాపాడలేకపోయింది. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసును రాజానగరం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

దొంగతనానికి యత్నించి పట్టుబడిన విద్యార్థులు

రంగంపేట: స్థానికంగా పార్కు చేసి ఉంచిన మోటారు సైకిళ్లను విద్యార్థులు ఎత్తుకెళ్లేందుకు యత్నించిన సంఘటన రంగంపేట మండలం ఈలకొలనులో బుధవారం తెల్లవారుజామున జరిగింది. దీనిపై స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రాజమహేంద్రవరంలో ఓ కార్పొరేట్ కళాశాలలో చదువుకుంటున్న ఆరుగురు ఇంటర్మీడియట్ విద్యార్థులు బుధవారం తెల్లవారుజామున మోటార్ సైకిళ్లపై వచ్చి ఈలకొలనులో ఆరు బయట పార్కు చేసిన మోటారు సైకిళ్లను ఎత్తుకెళ్లడానికి ప్రయత్నించడంతో గ్రామస్తులు అప్రమత్తమై పట్టుకుని పోలీసులకు అప్పగించారు. దీనిపై రంగంపేట పోలీసులను వివరణ కోరగా విద్యార్థులు మోటారు సైకిళ్లను ఎత్తుకెళ్లడానికి ప్రయత్నించడం వాస్తవమేనని, ప్రస్తుతం వారు పోలీస్‌స్టేషన్‌లోనే ఉన్నారన్నారు. ఇంకా వారిపై ఎటువంటి కేసు నమోదు చేయలేదని చెప్పారు.

జీవ నియంత్రణ పద్ధతితో మేలైన దిగుబడులు



కోటపాడులో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ విశ్వవిద్యాలయ విద్యార్థులు

రంగంపేట: జీవ నియంత్రణ పద్ధతిలో వ్యవసాయం చేస్తే మేలైన దిగుబడులు సాధించవచ్చని సర్పంచ్ గవరసాని లక్ష్మీదుర్గ, ఎంపీటీసీ సభ్యుడు ఎస్.అప్పారావు అన్నారు. బుధవారం మండలంలోని కోటపాడులో బాపట్ల వ్యవసాయ విశ్వవిద్యాలయ అధ్యయన విద్యార్థులు నిర్వహించిన రైతు అవగాహన కార్యక్రమాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. సేద్యంలో జీవ నియంత్రణ పద్ధతులు ఏ విధంగా ఉపయోగిస్తే మంచి దిగుబడిని సాధించవచ్చో విద్యార్థులు జ్యోతి, లాస్య, మౌనిక, కల్పన, మాధవి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక రైతులు గుగ్గిల వెంకటేశ్వరరావు, విష్ణు, గవరసాని రాజు, వెంకటరమణ, చిక్కాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎన్నికల్లో పోటీచేసే అర్హత లేదు

రాజమహేంద్రవరం సిటీ: ప్రజా సమస్యలపై పోరాటం చేయలేని టీడీపీ, వైఎస్సార్ సీపీలకు నగరంలో పోటీ చేసే అర్హత లేదని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మేడా శ్రీనివాస్ అన్నారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటైన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న ఆర్‌పీకే పోటీచేసే అర్హత ఉందన్నారు.

పేకాడుతున్న ఆరుగురి అరెస్ట్

రంగంపేట: పేకాడుతున్న ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్ఐ పి.విజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం రాత్రి ఆయన తెలిపిన వివరాల ప్రకారం చంద్రేడు గ్రామ శివారులో పేకాడుతున్నట్టు సమాచారం అందడంతో దాడి చేసి పేకాడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి రూ.7,750 స్వాధీనం చేసుకున్నామన్నారు.